
క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం భజనలు, రాత్రి స్వామివారికి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమ వివరాలు

పొదలకూరు : మండల పరిధిలోని సచివాలయాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమ వివరాలను ఎంపీడీఓ నగేష్‌కుమారి ప్రకటించారు. ఈనెల 24న కనుపర్తి సచివాలయంలో, 28న బత్తులపల్లి, 29న దుగ్గుంటరాజుపాళెం, 30న మొగళ్లూరు, డిసెంబర్ 1వ తేదీన మహ్మదాపురం, 4న నావూరు, 5న నేదురుమల్లి, 6న ప్రభగిరిపట్నం, 7న సూరాయపాళెం, 8న తాటిపర్తి బిట్–1 సచివాలయం, 11న తాటిపర్తి బిట్–2 సచివాలయం, 12న వావింటపర్తి, 14న బిరదవోలు, 15న ఇనుకుర్తి, 18న పొదలకూరు బిట్–4 సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు పొదలకూరు బిట్–1, 2, 3 సచివాలయాలతో పాటు డేగపూడి, ఆర్‌వైపాళెం, తోడేరు, మరుపూరు సచివాలయాల్లో విజయవంతంగా కార్యక్రమం జరిగిందన్నారు.

పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడిగా వేణుగోపాల్

నెల్లూరు సిటీ: సీపీ అండ్ పీహెచ్‌పీడబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడిగా శాఖవరపు వేణుగోపాల్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్రాధ్యక్షుడు తోరాటి ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు గురువారం ప్రకటించారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా జయప్రకాష్, న్యాయ సలహాదారురాలిగా రమాదేవి, ఉపాధ్యక్షులుగా షేక్ సత్తార్, ప్రధాన కార్యదర్శిగా గోరంట్ల శేషయ్య, ఉపకార్యదర్శిగా నంద్యాల మాలిని, కోశాధికారిగా డీ శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా నెల్లూరు డివిజన్ నుంచి ప్రసాద్, రామదాసు, వీరయ్య, కావలి డివిజన్ నుంచి పీవీ రమణయ్య, మస్తానయ్య, జిలానీబాషా, ఎం దయాకర్‌రావు, చలపతిరావు, ఆత్మకూరు డివిజన్ నుంచి వెంకటేశ్వర్లు , షేక్ అబ్దుల్ వహాబ్, జగన్‌మోహన్‌రావు, మహేష్, పద్మావతి, గూడూరు , నాయుడుపేట డివిజన్ల నుంచి శేఖర్, సాయి, మురళి సుబాష్ చంద్రబోస్, ఖలీల్, శంకరమ్మ ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా జిల్లా అధ్యక్షుడిగా తనను ఎన్నుకుంటున్న సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సభ్యులతో పాటు ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఐఆర్‌డీఏ పద్ధతిలో రీడింగ్ తీయాలి


మాట్లాడుతున్న డీఈఈ మధుసూదన్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులకు సంబంధించి మీటర్ రీడింగ్‌ను ఐఆర్‌డీఏ పద్ధతిలోనే తీయాలని నెల్లూరు టౌన్–2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని కిసాన్‌నగర్‌లోని విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 7వ తేదీలోగా విద్యుత్ బిల్లులు తీసే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ బిల్లుల బకాయిలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి బయటే మీటర్లు పెట్టుకునేలా విద్యుత్ వినియోగదారులకు అవగాహన కలిగించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఇంజినీర్ విజయ్‌కుమార్, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు, జూనియర్ లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు, గ్రేడ్–2 జేఎల్‌ఎంలు పాల్గొన్నారు.

క్యాట్‌ఫిష్ అక్రమ రవాణా అడ్డగింత

నెల్లూరురూరల్: నెల్లూరు రూరల్ మండలంలోని నెల్లూరు–మైపాడు రోడ్డులో మూడోమైలు వద్ద నిషేధిత క్యాట్‌ఫిష్‌లను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మత్స్యశాఖ ఏడీ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకునినెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. క్యాట్‌ఫిష్‌కు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ ఉండడంతో కొందరు వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసింది. వాహనంలో 8 టన్నుల వరకు క్యాట్ ఫిష్ ఉన్నట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న క్యాట్‌ఫిష్‌లను రెవెన్యూ అధికారుల సమక్షంలో శుక్రవారం ఖననం చేయనున్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

• 'వై ఏపీ నీడ్స్ జగన్'లో నేతల వెల్లడి

వెంకటాచలం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దేశంలోని ఇతర ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జేసీఎస్ మండల కన్వీనర్ మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. మండలంలోని కసుమూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా చేకూరుతున్న లబ్ధిని పేదలకు వివరించారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు, మోసపూరిత వాగ్దానాలిచ్చే చంద్రబాబు గత పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలని ప్రజలకు తెలియజేశారు. గత చంద్రబాబు పాలనలో టీడీపీ సానుభూతిపరులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, ప్రస్తుతం జగనన్న పాలనలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడివేటి శివ, వైఎస్సార్‌సీపీ నేతలు చీకుర్తి నరసయ్య, కాకర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వెంకటాచలం : కసుమూరులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న పార్టీ నేతలు

పేదల అభ్యున్నతే సర్కారు ధ్యేయం

ముత్తుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్నివర్గాల పేదల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తోందని సచివాలయ మండల కన్వీనర్ నెల్లూరు శివప్రసాద్ అన్నారు. మండలంలోని పంటపాళెం సచివాలయంలో సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో గురువారం జరిగింది. తొలుత పార్టీ నేతలు సచివాలయ పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాలు వివరాలను ఫ్లెక్సీ రూపంలో ఆవిష్కరించారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నందుకు ఈ ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి, తూపిలి శ్రీధర్‌రెడ్డి, నంగా చెంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


కోవూరు : పడుగుపాడులో..

ప్రతి ఇంటికీ పథకాలను చేరవేయాలి

పొదలకూరు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజాప్రతినిధులతో పాటు వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి ఇంటికి చేరవేయాలని వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మరుపూరు గ్రామ సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి అందని వారికి ఎందుకు అందడం లేదో తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందకుంటే వెంటనే వలంటీర్ల ద్వారా సరిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, సర్పంచ్ నాగయ్య, పార్టీ నేతలు వళ్లూరు గోపాల్‌రెడ్డి, మోపూరు శ్రీనివాసులురెడ్డి, సచివాలయ కన్వీనర్లు యనమల ప్రసాద్, నలగర్ల పెంచలయ్య, బిరదవోలు కుమారి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దపాళెం గ్రామంలో..

విడవలూరు : మండలంలోని పెద్దపాళెం గ్రామంలో సర్పంచ్ మేకల ప్రసన్న ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్య, వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలోని సంక్షేమ పథకాల వివరాల బోర్డును ప్రారంభించారు. అనంతరం నవీన్‌రెడ్డి, లక్ష్మయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అక్కయ్యగారి బుజ్జమ్మ, వైఎస్సార్ సీపీ నేతలు పోలయ్య, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

మినగల్లులో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని మినగల్లు సచివాలయంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం సతీష్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సచివాలయ పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పి.మధు, డి.శ్రీహరి, డి.సురేష్, డి.సుబ్బయ్య, బి.వినోద్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే ధ్యేయం

కోవూరు : పేదల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. మండలంలోని పడుగుపాడు–3 సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు మరెక్కడా అమలు కావడం లేదన్నారు. తొలుత వారు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్, సచివాలయ మండల కన్వీనర్ ప్రసాద్, జల్‌జీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


పొదలకూరు : మరుపూరు సచివాలయంలో..


విడవలూరు : పెద్దపాళెంలో..


ముత్తుకూరు : సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సతీష్‌రెడ్డి

ముంగిటకే వైద్యసేవలు

మనుబోలు : ప్రభుత్వం ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందిస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మనుబోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు అన్నారు. మనుబోలు మండల కేంద్రంలో గురువారం 104 ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పలువురు రోగులను పరీక్షించిన వైద్యులు వారికి కంటి, ఇతర శస్త్రచికిత్సల కోసం సూచించగా ఆపరేషన్‌కు కొందరు వెనుకాడుతున్నారు. ఈ క్రమంలో డాక్టర్ సుబ్బరాజు వారి వద్దకు వెళ్లి ఆపరేషన్లపై ఎటువంటి భయాలు పెట్టుకోవద్దని సూచించారు. ఆపరేషన్ సమయంలో ఏఎన్‌ఎం, ఆశా వలంటీర్లను వెంట పంపిస్తామని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఎంఎల్‌హెచ్‌పీ సుప్రజ ఉన్నారు.


మహిళకు చికిత్స చేస్తున్న డాక్టర్ సుబ్బరాజు

యాజమాన్య పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న ఏఓ రఘునాథ్‌రెడ్డి


విడవలూరు మండల కేంద్రంలో..

ఇందుకూరుపేట : వరిసాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి డి.రఘునాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని జగదేవిపేటలో నీటి యాజమాన్యంపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాట్లు వేసుకునే రైతులకు తగిన సూచనలు సలహాలు అందజేశారు. ముందుకు పొలాన్ని సిద్ధం చేసుకునే విధానంపై రైతులకు తెలియజేశారు. ఎరువులు రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విడవలూరు : మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో పార్లపల్లి, అన్నారెడ్డిపాళెం, ముదివర్తి గ్రామాల రైతులకు వరి పంటలో నీటి యాజమాన్య పద్ధతులపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవూరు వ్యవసాయ సలహా సంచాలకురాలు డి.సుజాత రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణయ్య, ఏఈఓ శంకరయ్య, వెంకటేశ్వర్లు, వీఏఏ తమీమ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఏకాదశి పూజలు


కోవూరు : ప్రత్యేక పూజల్లో మహిళలు

మనుబోలు : మనుబోలులోని విష్ణాలయంలో కార్తీక మాసం ఏకాదశిని పురస్కరించుకుని గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు హనుమాచార్యులు శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద పేదలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఉభయకర్తలుగా వీరభద్రస్వామి ఆలయ పూజారి శ్రీనివాసులు, కందళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

వైభవంగా..

కోవూరు : మండల కేంద్రంలో వెలసిన వీరాంజనేయస్వామి దేవస్థానంలో చిలుకు ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి అభిషేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు నాగరాజాచార్యులు ఆధ్వర్యంలో మహిళలు లక్ష నాగవల్లి పత్రాలతో సామూహికంగా పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీకాంతాచార్యులు, రాఘవాచార్యులు, సుబ్బయ్యస్వామి, నందకుమార్ స్వామి, ప్రసాద్ స్వామి, జయప్రకాష్‌స్వామి పాల్గొన్నారు.


మనుబోలు : ప్రత్యేకాలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి

ఓటు హక్కుపై అవగాహన పెంచుకోవాలి

కోవూరు : ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దీనిపై యువత అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎం.పద్మజ అన్నారు. కోవూరు మండలంలోని నేతాజీ నగర్‌లో ఉన్న వైకేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు నమోదుపై గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ వారి పరిధిలో ఉన్న పోలింగ్ బూత్‌లలో గానీ సంబంధిత బూత్ లెవల్ అధికారి వద్ద ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ఈ ఓటు నమోదు ప్రక్రియ డిసెంబర్ 9వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.మధుసూదన్‌రావు, డాక్టర్ ఎన్.ప్రభాకర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య తదితరులు ఉన్నారు.

వేగంగా సీసీరోడ్డు పనులు


పట్టణంలో జరుగుతున్న రోడ్డు పనులు

పొదలకూరు : పట్టణంలో సిమెంటురోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. 600 మీటర్ల మేర రూ.5.50 కోట్ల నిధులతో సీసీ రోడ్డు పనులను నిర్వహిస్తున్నారు. సుమారు నెలన్నర నుంచి పనులు చేపడుతున్నారు. గతంలో ఉన్న రోడ్డును నిర్మించి రెండున్నర దశాబ్దాలు కావడంతో బాగా దెబ్బతినింది. దీంతో కొత్తగా రోడ్డును మంజూరు చేయించారు. ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. మంత్రి కాకాణి ఇటీవల రోడ్డు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విస్తరణలో భాగంగా ముందుగా కాంట్రాక్టర్లు ఒక పక్క రోడ్డు పనులు పూర్తి చేశారు. వాటర్ క్యూరింగ్ చేపడుతున్నందున మరో పక్కన పనులు ప్రారంభించి పూర్తిచేసే దశలో ఉన్నారు. అయితే పట్టణంలో రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యగా మారింది. బస్సులు, లారీలు, ఇతర వాహనాలు ఇదే మార్గం నుంచి నెల్లూరు, సంగంకు వెళ్తున్నందున ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పోలీసు అధికారులు చొరవ తీసుకుని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా భారీ వాహనాలను పంపాల్సిందిగా ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కానిస్టేబుళ్లు ట్రాఫిక్‌ను నియంత్రించలేక పోతున్నారు. లారీలు, భారీ వాహనాలను మళ్లిస్తే చాలా వరకు ట్రాఫిక్‌ను నియంత్రించ వచ్చని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాపిరెడ్డి

కోవూరు : ఓటర్ల జాబితాలో మృతులు, డబుల్ ఎంట్రీలు లేకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు నుడా వైస్ చైర్మన్, కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాపిరెడ్డి అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన గురువారం ఓటర్ల జాబితాను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అదే విధంగా డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఓటు హక్కుపై యువతకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని తహసీల్దార్ ఎం.పద్మజకు సూచించారు. ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు పాల్గొన్నారు

చేపల చెరువు వేలం వాయిదా

విడవలూరు : మండలంలోని చౌకచర్ల గ్రామంలో గురువారం నిర్వహించిన చేపల చెరువు వేలం పాట రెండో సారి కూడా వాయిదా పడిందని ఎఫ్‌డీఓ సురేష్ తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర రాకపోవడంతో ఈ నెల 30వ తేదీన తిరిగి వేలం నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వినోద్‌కుమార్, ఫిషరీస్ అసిస్టెంట్ నాగరాజు, వెంకయ్య పాల్గొన్నారు.

రామతీర్థం బీచ్‌లో స్వచ్ఛత



విడవలూరు : మండలంలోని రామతీర్థం తీర ప్రాంతంలో నోకియా బాలరక్ష భారత్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో వైద్యారోగ్య సిబ్బందితో పాటు గ్రామస్తులు కలిసి బీచ్‌లోని చెత్తను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ అమరేంద్రరెడ్డి, బాలరక్ష సంస్థ సభ్యులు రంగనాథం, గీత, రమణయ్య, బాబు, మెరైన్ పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తూరు విద్యార్థులు

ఇందుకూరుపేట : ఈనెల 24 నుంచి 26 వరకు మూడు రోజులపాటు ఏలూరులో జరుగనున్న రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం మల్లికార్జున గురువారం తెలిపారు. అండర్ –17 విభాగంలో ఎం.సతీష్, ఎం.సాయిరాంతో పాటు అండర్–14 విభాగంలో కె.నిఖిల్, ఎల్ వెంకటకావ్య, పి.స్నేహ జిల్లా జట్టులో చోటు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.అరోరాను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం మల్లికార్జున

కులగణనను పారదర్శకంగా నిర్వహించాలి

కోవూరు : ఈనెల 27వ తేదీ నుంచి కులగణన కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లకు కులగణనపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కులగణనపై ప్రతిఒక్కరు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నాగూర్‌వలి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీవారి

ఆత్మహత్య కేసుపై డీఎస్పీ విచారణ


విచారణ చేపడుతున్న రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

కోవూరు : మండలంలోని పల్లిపాళెం గ్రామంలో వివాహిత ఆత్మహత్య ఘటనకు సంబంధించి నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి గురువారం విచారణ చేపట్టారు. వివరాలు.. పల్లిపాళెంలో భర్త వేధింపులు తాళలేక ఇటీవల లక్ష్మి అనే వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో డీఎస్పీ వీరాంజనేయరెడ్డి ఆమె నివాసాన్ని పరిశీలించారు. లక్ష్మి తల్లి శీనమ్మతో పాటు చుట్టుపక్కల కుటుంబాల వారిని ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): బైక్ ఢీకొనడంతో పాదచారుడు మృతి చెందిన ఘటన ప్రశాంతినగర్ జంక్షన్ వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. జాతీయ రహదారిపై గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి(32) కావలి వైపు నడుచుకుంటూ వెళుతుండగా, ప్రశాంతినగర్ జంక్షన్ వద్ద వెనుకగా బైక్ వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో తీవ్రగాయాల పాలైన పాదచారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివాజీరాజా తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 00095 నంబర్‌ను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ విజ్ఞప్తి చేశారు.